అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 06 జనవరి 2023

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో గురువారం ప్రజా రవాణా చైతన్య రథం ద్వారా కళా బృందంతో ఆటపాటల ద్వారా ఆర్‌టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్‌టీసీ ఏర్పడి 90 ఏండ్లు గడుస్తున్న సందర్భంగా ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ రథయాత్ర అన్ని డిపోల్లో తిరుగుతూ ప్రజలకు సేవల గురించి వివరిస్తున్నారు. రూ.20 రోజుల సీజన్ టికెట్ కొంటే నెల రోజుల పాటు ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేయవచ్చని, ఆర్‌టీసీలో ప్రయాణం చేయడంతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు ఎక్కడ చేయి ఎత్తితే అక్కడ బస్సు ఆపడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆర్‌టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్‌టీసీ బస్సులు అన్ని కార్యక్రమాలకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పెళ్లిళ్లు, తీర్థయాత్రలకు తదితర కార్యక్రమాలకు కూడా ఆర్‌టీసీ బస్సును ఉపయోగించుకోవచ్చని కళా బృందం సభ్యులు తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-కోటపల్లి

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మెన్‌గా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసిన ఆంజనేయగౌడ్‌ను గురువారం బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట పీఏసీఎస్ ఛైర్మెన్ సాంబగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఓదెలు, ఎంపీటీసీ మరిశెట్టి తిరుపతి, సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్, బీఆర్ఎస్ నాయకులు పడాల సతీష్, పిల్లి సమ్మయ్య పాల్గొన్నారు.



కూల్..కూల్..!

- శీతల గాలుల ప్రభావంతో చల్లని వాతావరణం
- ఉదయం నుంచి కనిపించని సూరీడు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- గజగజ వణుకుతున్న వృద్ధులు,చిన్నారులు

అనూహ్య వాతావరణ మార్పులకు కేంద్రమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. బుధవారం వరకు పొడిగా ఉన్న వాతావరణం గురువారం నుంచి పూర్తిగా మారిపోయింది. తెల్లవారుజాము నుంచి మంచు కురుస్తుండటం..శీతల గాలులు వీస్తుండటంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు గజగజ వణికిపోతున్నారు. మధ్యాహ్నం సమయంలోనూ వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సి వస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో అల్పపీడన ద్రోణి కారణంగా వివిధ రకాల తుఫాన్లు వచ్చాయి. ఈ సమయంలో జిల్లాలో చలి ప్రభావం అంతగా కనిపించలేదు. వీటి ప్రభావం వెళ్లిపోవడంతో ఎప్పటిమాదిరిగానే చల్లని గాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రభావం కారణంగా జిల్లావాసులు గజగజ వణికిపోతున్నారు. పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అడవుల ఖిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గతేడాది సైతం సంక్రాంతి సమయంలో ఇదే మాదిరి వాతావరణం కనిపించింది. మళ్లీ అదే వాతవరణం ఈ ఏడాది కూడా పునరావృతమవుతుండటంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. కిందటేడాది సుమారు పక్షం రోజుల పాటు సూర్యుడు కనిపించ లేదు. చల్లని వాతావరణం కారణంగా అనేక మంది వివిధ రోగాల బారినపడాల్సి వచ్చింది. ముఖ్యంగా ఆ సమయంలో కరోనా ప్రభావం కూడా ఉండటంతో మరింత ఆందోళనకు గురయ్యారు. గతేడాది వాతావరణం ఇప్పుడు కూడా కనిపిస్తుండటంతో జనం భయపడుతున్నారు. ప్రస్తుతం 17.6డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనప్పటికీ.. శీతల గాలుల ప్రభావం మాత్రం తీవ్రంగా కనిపిస్తోంది. తాజాగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడి జాడ కనిపించలేదు. దీంతో వాహనదారులు, అత్యవసర పనులు ఉన్న వారు వెచ్చని దుస్తులు ధరించి పనులకు వెళ్తున్నారు.

కమ్మేసిన మంచు దుప్పటి..!

ఆదిలాబాద్ జిల్లాను మంచు దుప్పటి కమ్మేసింది. దీంతో చల్లని గాలుల కారణంగా వృద్ధులు, చిన్నారులు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ వాతావరణ ప్రభావంతో పిల్లలను స్కూల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కిందటేడాది పాఠశాలల సమయాల్లో అధికారులు మార్పులు చేశారు. ఉదయం 10గంటల నుంచి ప్రారంభించారు. ఈ ఏడాది కూడా అలాంటి వాతావరణం కనిపించడంతో పాఠశాలల పని వేళల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. మరోపక్క వివిధ దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు ఈ చలి తీవ్రతకు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. వీరితో పాటు ఉదయం పూట విధులకు వెళ్లే పారిశుద్ధ్య పాల వ్యాపారులు, ఆర్టీసీ సిబ్బంది, పేపర్ బాయ్‌లు తదితర వర్గాల వారు ఈ చలి బారినపడుతున్నారు. ఇతర ఉద్యోగులు, కార్మికులు విధులకు వెళ్లే సమయంలోనూ వెచ్చని దుస్తులు ధరించి వెళు తున్నారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్ల వద్ద చలి మంటలు కాగుతూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు. ఈ వాతావరణం పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.





వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలి : డా.క్రాంతికుమార్, ఎండీ, జనరల్ మెడిసిన్, రిమ్స్



చల్లని వాతావరణం కారణంగా వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంటుంది. వీరితో పాటు ఆస్తమా, సీఓపీడీ బాధితులు కూడా చల్లని వాతావరణంలో బయటకు రాకూడదు. ఉదయం 7గంటల లోపు..సాయంత్రం 6గంటల తర్వాత బయటకు వెళ్లకూడదు. వెచ్చని ప్రదేశంలో ఉండటం శ్రేయస్కరం.

సమాజ మార్పు ఉపాధ్యాయులతో సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో మంచి మార్పు తీసుకురావడం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ మార్పులో ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల టీఎస్‌యూటీఎఫ్ పోరాటం అభినందనీయమన్నారు. విద్యారంగం బలోపేతానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి ఇందూరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లయ్య, జిల్లా బాధ్యులు రమేష్, హేమంత్ షిండే, ఊశన్న, నరేందర్, మండల బాధ్యులు ఉపేందర్, తిరుపతి, వినోద్, వెంకటేష్, శంకర్, సోనాజీ, ప్రేమల పాల్గొన్నారు.

కాసిపేట-2 గనిపై ఏఐటీయూసీ సంబరాలు

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో జరిగిన జెబిసిసిఐ సమావేశంలో జాతీయ సంఘాలు 11వ వేజ్ బోర్డులో ఎంజీఎస్ 19 శాతం సాధించారన్నారు. ఈ 11వ వేజ్ బోర్డు సాధనలో సింగరేణి కార్మికుల పక్షాన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ప్రధాన కార్యదర్శి శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య జాతీయ సంఘాల ఐక్యతతో కీలక పాత్ర పోషించి 11వ వేజ్ బోర్డు సాధించారన్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల సందర్భంగా ఇంత మెరుగైన వేజ్ బోర్డు సాధించిన జాతీయ సంఘాలకు దేశవ్యాప్తంగా ధన్యవాదాలు తెలిపారు. కార్మికులందరూ సమ్మెకు సిద్ధమవుతున్నారని గ్రహించిన కోల్ ఇండియా యాజమాన్యం జాతీయ సంఘాలను మరోసారి చర్చలకు పిలిచిందన్నారు. ఇది ముమ్మాటికి బొగ్గు గని కార్మికుల నైతిక విజయమన్నారు. ఈ వేజ్ బోర్డును జీర్ణించుకోలేని, వేజ్‌బోర్డులో లేని వారు, అవగాహన లేని కొన్ని సంఘాలు జాతీయ సంఘాలను విమర్శించడం సిగ్గుచేటన్నారు. 11వ వేజ్ బోర్డులో బిజిఎం 19 శాతం సాధించిన అలవెన్స్‌లు ఇంకా చాలా విషయాలపై ఒప్పందం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండి అక్బర్ అలీ, బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్పనర్సయ్య, కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు ఇప్పకాయల లింగయ్య, పులి శంకర్, కొత్తపెల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, తీర్థాల చంద్రయ్య, నీలయ్య, కుమార్‌బాబు, జి.లింగమూర్తి పాల్గొన్నారు.

బోదకాల వ్యాధి కిట్ల పంపిణీ



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీలో గురువారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య బోదకాల వ్యాధి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని ప్రజలకు సూచించారు. ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి అంటువ్యాధిగా వస్తుందని, దీనిపట్ల చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రజల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ వహించి సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమంతో పాటు బోదకాల వ్యాధి కిట్లు, అదేవిధంగా గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ పందిర్ల వినోద, ఎంపీటీసీ హరిత, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ నాయక్, డాక్టర్ సుజిత, పంచాయతీ కార్యదర్శి మురళీ, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాల కోసం రిలే దీక్షలు

ఆసిఫాబాద్: మూడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌తో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ గతంలో భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ బాలేష్, దుర్గం లింగయ్య, గౌతమ్, రవీందర్, శ్రీకాంత్, భీమ్ రాజ్, బుడ్డయ్య మహేష్ , రాందేవ్, సాగర్, విట్టల్, గౌరయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

సిర్పూర్(టి) : విద్యావిధానంలో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం టీఎల్ఎం విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీనిలో భాగంగా ప్రతి పాఠశాల నుండి ఉపాధ్యాయులు, విద్యార్థులకు బోధన ఉపకరణాల ద్వారా విద్యాభ్యాసం చేయించాలని ఇన్‌చార్జి మండల విద్యాధికారి సోమయ్య అన్నారు. గురువారం టీఎల్ఎం మేళాను జెడ్పీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము తయారు చేసిన బోధన ఉపకరణాలతో విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని, దీనికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో 45 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన 83 మంది ఉపాధ్యాయులు బోధన ఉపకరణాలను మేళాలో 179 టీఎల్ఎంలను ప్రదర్శించారు. ఈ మేళాలో నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, క్లస్టర్ నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రేమించి పెండ్లి చేసుకొని..అంతమొందించాలని..

- నవజాత శిశువు మృతి, తల్లి పరిస్థితి విషమం



నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు..వారి ప్రేమకు ప్రతిరూపంగా చిన్నారి భూమ్మీదకు రానుండగా..అంతలోనే ఏమైందో కాని భార్యాబిడ్డను కడతేర్చాలని పథకం పన్నాడు. పండ్ల రసంలో పురుగుల మందు కలిపి భార్యకు తాగించాడు. నవజాత శిశువు మృతి చెందగా, తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం వెలుగు చూసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బుద్దె స్వామి వివరాలు వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన దుర్కె కవిత తల్లిగారింట ఉండగా గత నెల 29న భర్త కోట మహేందర్ వెళ్లాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఉందని గమనించి ఇదే అదునుగా భావించి ఆమెను, ఆమెకు పుట్టబోయే బిడ్డను చంపాలని భావించాడు. మహేందర్‌కు తల్లిదండ్రులు విమల-లహను సహకరించారు. అత్త విమల కోడలు కవితకు మజా జ్యూస్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చింది. జ్యూస్ తాగిన కొద్ది సేపటికే కవిత రక్తం వాంతులు చేసుకొని కింద పడిపోయింది. బంధువులు గమనించి కవితను హుటాహుటిన చికిత్స కోసం కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ గత నెల 30న కవిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి శిశువు మృతి చెందింది. కవిత ఆరోగ్యం విషమంగా ఉంది. తండ్రి దుర్కె పెంటు పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్త మహేందర్, అత్తామామలపై కేసు నమోదు చేసి గురువారం రిమాండుకు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ దీకొండ రమేష్ పాల్గొన్నారు.

కేజీబీవీ వర్కర్స్ అసోసియేషన్ మహాసభల పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు భవాని, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ఈ నెల 11న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలన్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. 18 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికులకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వీటితోపాటు అనేక రకాల సమస్యలతో బోధనేతర సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యలపై పోరాటం చేసే ఉద్దేశంతో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు రమ్య, తెలంగాణ ప్రగతి శీల కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు భార్గవి, మీరా, సౌజన్య, స్వప్న, భాగ్యమ్మ కమలమ్మ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి తిరుపతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 11న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే ప్రథమ మహాసభలకు నాన్ టీచింగ్ వర్కర్లు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 18 ఏండ్ల నుండి పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను విస్మరించి కనీసం గుర్తింపు కార్డు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానం ఉండబోదని చెప్పి వర్కర్లను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేసిందని, ఈ విషయాన్నిరాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, స్వీపర్లు, వంట మనుషులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని, హాస్టల్లో ఫైర్ సేఫ్టీని నియమించి ప్రతి పాఠశాలకు ఒక వైట్‌కిన్ ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎంలకు మూడు రోజుల నైట్‌డ్యూటీలను రద్దుచేసి రోస్టర్ పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు దుర్వ శ్రీనివాస్, నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు కవిత, శారద, వెంకటమ్మ, విజయకళ, సువర్ణ, నిర్మల, పార్వతి, యశోద పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని సిర్పూర్

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్రంలో మొదటి అసెంబ్లీ నియోజకవర్గమైన సిర్పూర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలో బహుజన రాజ్యాధికార యాత్ర 4వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా చింతకుంట, మాకిడి, జక్కాపూర్, లక్ష్మీపూర్, సిర్పూర్ మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు కావస్తున్నప్పటికీ సిర్పూర్ మండలంలో రోడ్లు, కరెంటు సౌకర్యాలు లేని గ్రామాలున్నాయంటే సిగ్గుచేటన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మూత్రశాలలు లేకపోవడం చూస్తుంటే బహుజనులపై ప్రేమ అర్థమవుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో పిల్లలు విద్యాభ్యాసం ఎలా చేస్తారని ప్రశ్నించారు. మాకిడి గ్రామస్తులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్నారని, వారికి రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని తెలిపారు. సిర్పూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించాల్సి ఉండగా ఆయన స్వార్థంతో కాగజ్‌నగర్‌లో నిర్మించడం వల్ల బెజ్జూర్, దహెగాం ప్రజలు తమ సమస్యలు తెలపడానికి అంతదూరం ఎలా వస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనుచరులు అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేసుకొని భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కుటుంబానికి, బీఆర్ఎస్ నాయకులకు అనుకూలంగా మార్చుకోవడానికే ధరణి పోర్టల్ తెచ్చుకున్నారన్నారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే తన ఫోన్‌ను హ్యాక్ చేస్తున్నారని, ఇది పిరికిపంద చర్య అని తెలిపారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాలను ఎందుకు నిర్వహించడంలేదో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్ పెంచాలన్నారు. సిర్పూర్, కాగజ్‌నగర్, వేంపల్లి రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బహుజన రాజ్యం అధికారం చేపట్టిన తర్వాత పోడు భూములు, నిరుద్యోగం, రైతుల సమస్యలను పరిష్కారిస్తామని పేర్కొన్నారు. ఈ యాత్రలో బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ దుర్గం, నాయకులు షేక్ చాంద్ పాల్గొన్నారు.

8న ఐఎఫ్‌టీయూ రీజియన్ 10వ మహాసభలు



నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 8న బెల్లంపల్లి తిలక్ మైదానంలో జరిగే సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యుయూ) ఐఎఫ్‌టీయూ రీజియన్ 10వ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం కోరారు. గురువారం గోలేటి సింగరేణి సివిక్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యుయూ) ఐఎఫ్‌టీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణకై సింగరేణిలో మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్‌యూనియన్ పోరాటాల ఫలితంగానే మొదటిసారిగా సింగరేణిలో జీఓ అమల్లోకి వచ్చిందన్నారు. పీఎఫ్, ఆస్పత్రి సౌకర్యం, కాంట్రాక్టు కార్మికులకు రక్షణ పరికరాలు, కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా ఊడిపోయే ఉద్యోగాలకు భద్రత కల్పించబడిందన్నారు. జాతీయ బొగ్గుగనుల వేతన సమావేశాల సందర్భంగా 6వ వేజ్‌బోర్డు కాలం నుండి ఇటీవల జరిగిన 11వ వేతన సమావేశం వరకు సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు మొదటి కేటగిరి, పర్మినెంట్, గ్రాట్యూటీ, ప్రమాదబీమా లాంటి అనేక సమస్యలపై దేశవ్యాప్తంగా ఎక్కడా జేబీసీసీఐ సమావేశం జరిగినా అక్కడికి వెళ్లి అనేక నిర్బంధాలను అధిగమించి, ఎదుర్కొని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కులు, సౌకర్యాల కోసం పోరాడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బొగ్గుగనుల ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన అనేక జాతీయస్థాయి పోరాటాల్లో పర్మినెంట్ కార్మికులతో కలిసి పోరాడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మిక వర్గం ఉద్యమాలు చేపడుతూ తమ రీజియన్ స్థాయి కార్మిక వర్గాన్ని, నాయకత్వాన్ని, నిర్మాణాన్ని మరింత పటిష్ట పరుచుకోవడానికి 10వ రీజియన్ మహాసభలు నిర్వహిస్తుందన్నారు. ఈ రీజియన్ మహాసభలకు కాంట్రాక్టు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సునార్కర్ సికిందర్, పోసుబాయి, పెంటపర్తి బాపు, రాణి, భీమేష్, స్వామి, సావిత్రి, గోలేటి నాయకులు పోశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



జైపూర్ : నూటికి నూరుపాళ్లు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందారం ఓపెన్‌కాస్ట్ గనితో పాటు ఇందారం 1ఏ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా గని కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సర్వీస్ లింక్డ్ పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో గల ఇందారం ఓపెన్‌కాస్ట్ గని ద్వారా ఉత్పత్తి లక్ష్యాలతో దూసుకుపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డితో పాటు పాల్గొన్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఓసీ కార్మికులకు ప్లేడేలు ఇవ్వాలని, యాక్టింగ్‌లు పెంచాలని కోరారు. అదేవిధంగా కార్మికుల సౌకర్యార్థం మెరుగైన వసతులు కల్పించాలని, ప్రధానంగా విశ్రాంతి గది, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఏరియా జీఎం సంజీవరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓసీ గని ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, ఐకే1ఏ గని మేనేజర్ రవి కుమార్, పిట్ సెక్రెటరీ రత్నాకర్‌రెడ్డి, గడ్డం మల్లన్న, జగదీశ్వర్‌రెడ్డి, గని కార్మికులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2022-23 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే మైనారిటీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శిలు) విదేశీ విద్యాపథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ తీసుకున్నవారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఈపాస్.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను జిల్లా మైనార్టీ శాఖ కార్యాలయం అందజేయాలని కోరారు. ఈనెల 23 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్‌కు సంయుక్త కార్యదర్శిగా పదోన్నతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది ఐఏఎస్‌లకు పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయకు ఇందులో చోటు దక్కింది. పదోన్నతి ద్వారా సంయుక్త కార్యదర్శి హోదా పొందినప్పటికీ కలెక్టర్ గానే జిల్లాలో కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, 2020 జూలై 17న సిక్తా పట్నాయక్ జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెండేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న నేపథ్యంలో పదోన్నతి లభించడంపై జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

స్కీమ్‌ల ప్రయివేటీకరణ ఆపాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌ల ప్రయివేటీకరణకు యత్నిస్తోందని, ఆ ప్రయత్నాన్ని వెంటనే ఆపి వేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ స్కిం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆకాశనంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, మరోవైపు చాలి చాలని వేతనాలతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్కీమ్‌లలో పని చేస్తున్న వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్లను చట్ట పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరిస్తుందనీ అన్నారు. వారి సంక్షేమం గాలికి వదిలేసి పైగా స్కీమ్‌లను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లలో అత్యధికులు మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. స్కీమ్‌ల పట్ల నిర్లక్ష్యం విడనాడాలని అన్నారు. స్కీమ్‌ల



ప్రయివేటీకరణ, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనవరి 6న జరిగే దేశ వ్యాప్త నిరసన కార్యక్రమల్లో స్కీమ్ వర్కర్లు ఐక్యంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, నాగరాజు, శేఖర్, రాజవ్వలతో పాటు బాధ్యులు పాల్గొన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా పోతారం శ్రీనివాస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా డిస్టిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (డీసీఆర్బీ) డీఎస్పీగా విచ్చేసిన పోతారం శ్రీనివాస్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ జిల్లాలో డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వర్తించి, గత నెల 27న డీఎస్పీగా పదోన్నతి పొంది రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ డీసీఆర్బీ ఫంక్షనల్ వర్టికల్‌కు సంబంధించిన ఇదివరకే ఖాళీ ఉన్న డీఎస్పీ పోస్టుకు కేటాయించారు. కార్యక్రమంలో ఓఎస్డీ రాములు నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జె కృష్ణమూర్తి, ఎస్సై అన్వర్ ఉల్ హక్ పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉండే ఆదివాసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ భారత్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గెడాం మనోహర్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అమలవుతున్న ఆదివాసుల చట్టాలను పకడ్బందీగా అమలు చేసి గిరిజనల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఐటీడీఏ ద్వారా అమలు అవుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్హులైన గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మెస్రం కృష్ణ, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ జాదవ్ సిమా నాయక్, మండల అధ్యక్షుడు అమృత్, నాయకులు మల్లేష్, ఎల్లన్న, భూమన్న, రాజారాం, భీంరావు పాల్గొన్నారు.

డయల్ 100ను ప్రజలందరూ వినియోగించుకోవాలి

- పోలీస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపరచుకొని, శాంతి భద్రతల పరిరక్షణకు మరింత కష్టపడుతూ, డయల్ 100 ప్రాముఖ్యతను ప్రజలలో అవగాహనను కల్పిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీసు అసోసియేషన్ సభ్యులచే ప్రచురించిన 2023 సంవత్సర నూతన పోలీస్ క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ ఆపద సమయంలో బాధిత ప్రజలకు జిల్లా పోలీసులు అండగా ఉండాలని అన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తగు కార్యాచరణను ప్రతిరోజు అవలంబించాలని తెలిపారు. ఆర్థిక నేరాలను అరికట్టడానికి రాత్రి సమయంలో పెట్రోలింగ్ వాహనాలు పటిష్టంగా గస్తీ చేయాలని తెలిపారు. ప్రజలందరికీ ఎటువంటి ఆపత్కాల సమయంలోనైనా వెంటనే డయల్ 100ను సంప్రదించిన ఐదు నిమిషాలలోపు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా డయల్ 100లో జిల్లా పోలీసులు నాలుగు నిమిషాల సగటుతో గత సంవత్సరం మంచి రికార్డును నెలకొల్పిందని తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ అధికారులతో ప్రజలు సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రతి గ్రామంలో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అమర్చుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. నిర్దేశించిన ప్రదేశంలో నిరంతర నిఘా కొనసాగడం ఒక సీసీ కెమెరాలు వల్లే సాధ్యమవుతుందనిమ అన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు ప్రతి ఒక్కరి మదిలో సీసీ కెమెరాలు గుర్తుకు వస్తాయని అన్నారు. అంతటి ప్రాచుర్యం పొందిన సీసీ కెమెరాలను వెంటనే అమర్చుకుంటే సత్ఫలితాలను అందిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాల్లో నేరాలు చేయడానికి నేరస్తులు వెనుకంజ వేస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఓఎస్డీ రాములు నాయక్. డీఎస్పీలు వి.ఉమేందర్, పోతారం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జె కృష్ణమూర్తి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ డి వెంకటి, ఎస్సై అన్వర్ ఉల్ హక్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చందం దేవిదాస్, అనసూయ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020)ని రద్దు చేసి శాస్త్రీయత కలిగిన విద్యావిధానం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీకాంత్, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కాంబ్లే విజయ్ కుమార్, మండల సీనియర్ నాయకులు బాపురావు, రాజశేఖర్, బాధ్యులు మల్లయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ఇన్‌చార్జీని కలిసిన ఏఐసీసీ సభ్యురాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి నూతన ఇన్‌చార్జీగా నియమితులైన మాణిక్ రావు థాక్రేను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాతఆశన్న దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో గురువారం మాణిక్ రావు థాక్రేను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్‌రావు ఉన్నారు.

కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలని విభీఏ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డిని కలిసి సమస్యపై వివరించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గవ్వల శ్రీకాంత్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కొత్తపేట గ్రామా పంచాయతీ పరిధిలో గల అటవీ ప్రాంతంలో ఉన్న నర్సిములు పేరుతో గల చెరువును కొందరు రాజకీయ అండదండలతో కబ్జా చేసి ఇటీవల అధికారులు చేసిన సర్వేలలో సర్వే చేయించుకున్నారని ఆరోపించారు. గతంలో ఈ చెరువు విస్తీర్ణం 32 ఎకరాలు ఉండేదని ప్రస్తుతం 20 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ విషయంపై అటవీ శాఖ అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా కబ్జా చేసిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. పీఓకి వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు, రైతులు దినేష్, భీంరావు, శ్రీనివాస్, ఆనంద్‌రావు,



వసంత్‌రావు, తిరుపతి, ప్రకాష్, గోపి, సోనేరావ్, గుమ్ము ఉన్నారు.

అట్టహాసంగా మండల స్థాయి టీఎల్ఎం మేళా



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో బోధనోపకరణాల మేళాను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల పరిధిలోని 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సైన్స్, గణిత, ఇంగ్లీష్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై రూపొందించిన 250 అంశాలకు చెందిన ప్రయోగాలను, పాఠ్యాంశాల అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ బోధనోపకరణాలతో విద్యాభ్యాసం సులభతరమని అన్నారు. అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం ఉపాధ్యాయుల బాధ్యతని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీఓ రాధా, మండల విద్యాధికారి శ్రీకాంత్, జిల్లా సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య, నోడల్ అధికారి కిషన్ గుప్తా, హెచ్ఎం ప్రత్యూష ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మెన్‌ను కలిసిన ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఇరిగేషన్‌శాఖ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మెన్‌గా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఇరిగేషన్‌శాఖ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర నూతన చైర్మెన్ సముద్రాల వేణుగోపాలచారిని ఎమ్మెల్యే జోగు రామన్న మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గోడం నగేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బాని పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాందేవ్ జాతర ప్రారంభం

- సంస్కృతి సాంప్రదాయాలతో ప్రత్యేక పూజలు
- 15 రోజుల పాటు కొనసాగనున్న జాతర
- వివిధ రాష్ట్రాల నుండి తరలి రానున్న ఆదివాసులు



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో కొలువు దీరిన ఖాందేవ్ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. తోడసం వంశీయుల ఆరాధ్య దైవం ఖాందేవునికి ప్రతిఏడాది తోడసం వంశస్థులు పుష్యమాసంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారు. ఈ సారి కూడా నేటితో ప్రారంభమయ్యే పదిహేను రోజుల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ నుండి వేలాది మంది భక్తులు వచ్చి దేవున్ని దర్శించుకుంటారు. జాతర సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఖాందేవ్ పుణ్యక్షేత్రం వెలసింది ఇలా.. 93 ఏండ్ల క్రితం మండల కేంద్రంలో దట్టమైన అడవులు గుట్టలు, కొండలు అడవి మృగాలతో నిండి ఉండేది. గ్రామానికి చెందిన తొడసం ఖమ్ము పటేల్ నిద్రలోకి ఖాందేవుడు కలలో వచ్చి గ్రామం శాంతి యుతంగా ఉండాలంటే నీవు నావద్ద పూజలు చేయాలంది. ఆ తర్వాత ఓ వ్యవసాయ క్షేత్రంలో ఖాందేవుడు ఓ స్థలంలో వెలసి దర్శన మివ్వడం, ఆ రోజు పుష్యపౌర్ణమి ఉండటం విశేషం. తర్వాత గ్రామ పెద్దలు వారం రోజుల పాటు గిరిజన సాంప్రదాయ బద్దంగా భజన కీర్తనలు పూజతో పాటు అన్నదానం చేసి స్తంభాన్ని స్థాపించారు. నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ. ఆడపడుచు ఇంట్లో తయారు చేసిన రెండు లీటర్ల నూనె తాగి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. మూడు సంవత్సరాలు, మూడు సార్లు నువ్వుల నూనె తాగాల్సి ఉంటుంది. ఈ నూనె తాగడం వలన సంతానం, యోగం ఏదైనా మంచి జరుగుతుందని వారి నమ్మకం. శనివారం నిర్వహించే మిని దర్బార్‌కు ఎంపీ, ఎమ్మెల్యేలు జెడ్పీచైర్మెన్ హాజరవుతున్నట్లు ఆడపడుచు నూనె తాగే కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఆలయ కమిటి సభ్యుడు తొడసం నాగోరావ్ వివిధ రాష్ట్రాల నుంచి దేవున్ని దర్శించుకునేందుకు వచ్చే తొడసం వంశస్థులకు భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు చేశామని అన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో గురువారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని మండల, బ్లాక్, జిల్లా కమిటీలను పూర్తి చేయాలని, విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఇచ్చోడ బ్లాక్ ప్రెసిడెంట్ మహమూద్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి వసుల చంటి, ఇచ్చోడ మండల అధ్యక్షులు కళ్లెం నారాయణ రెడ్డి, బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుర్మె మహేందర్, సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఇమామ్, బజార్‌హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సమాన్‌పెల్లి శేఖర్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నాయకులు ఉన్నారు.

ఫిష్‌ఫాండ్ పనులను ప్రారంభించిన డీఆర్డీఓ



నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టిన ఫిష్‌ఫాండ్ పనులను గురువారం డీఆర్డీఓ విజయలక్ష్మి పరిశీలించారు. గతంలో నిర్మించిన ఫిష్‌ఫాండ్‌ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, ఎంపీపీ అలెగ్జాండర్, సుధాకర్, ఎంపీడీఓ లింబాద్రి, ఏపీఓ జయదేవ్, టీఏ లు కాంతారావు, గణేష్, ఎఫ్ఏ కమలాకర్, కారోబారి మహేందర్, గ్రామస్తులు వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాల

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-గుడిహత్నూర్

పేదల శ్రేయస్సు కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 70మందికి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను గురవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని, అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల నిధులను సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. రైతులకు 24 గంటల విద్యుత్, పేదలకు కేసీఆర్ కిట్లు, ఆడపిల్ల జన్మిస్తే రూ.13 వేలు, మగ పిల్లవాడు జన్మిస్తే రూ.12 వేలు ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణీ, ఎంపీడీఓ సునీత, కో అప్షన్ సభ్యుడు షేక్ జమీర్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, సర్పంచ్‌లు దస్రు పటేల్, సీందే మీనా, నీలాబాయి, ధనలక్ష్మి, ఎంపీటీసీలు జ్ఞాను



కేంద్రే, షగీర్ ఖాన్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, సంతోష్ గౌడ్, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

13న అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఈనెల 13న అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీలు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల ప్రెసిడెంట్ దుబ్బుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే జట్లు ఈ నెల 12వ తేదిలోపు తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ క్రీడా పోటీలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో పాటు పలువురు నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నర్సరీ పనుల్లో వేగం పెంచాలి

నవతెలంగాణ-నార్నూర్

నర్సరీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. గురువారం తాడిహత్నూర్ గ్రామపంచాయతీలోని నర్సరీలో మట్టితో బ్యాగు నింపుతున్న పనులను పరిశీలించారు. నాణ్యమైన మట్టిని వాడి మొక్కలు మొలకెత్తే విధంగా చూడాలన్నారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశించిన మొక్కలు నాటాలన్నారు. వారి వెంట ఏపీఓ సురేందర్, టీఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మోతిరాం, గోపాల్ ఉన్నారు.

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 7వ తేది నుండి 14 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుండి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యార్థం పండుగ సమయంలో రెగ్యూలర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను హైదరబాద్‌కు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్నీ గమనించి, ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 06 జనవరి 2023

కలప దుంగల పట్టివేత

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని హట్టి గ్రామ సమీపంలో మంగళవారం అటవీ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో తరలిస్తున్న 10 దుంగలకు గాను వాహనంతో పాటు 3 దుంగలను స్వాధీనం చేసుకుని రేంజి కార్యాలయానికి తరలించారు. మిగతా 7దుంగలను హట్టి గ్రామ సమీపంలో కరీం అను వ్యక్తి దాచినట్లు తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి మిగతా దుంగలను స్వాధీనం చేసుకొని రేంజి కార్యాలయానికి తరలించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న కలప దుంగల విలువ సుమారు రూ.46 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపుకు టీఎల్ఎం మేళా

నవతెలంగాణ-భీమారం

విద్యార్థుల అభ్యస సామర్థ్యాలను పెంపొందించేందుకు బోధనాపరికరాల మేళా ఎంతగానో దోహదపడుతోందని స్థానిక తహసీల్దార్ వాసంతి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన టీఎల్ఎం మేళా కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణాలు బాగా ఆకట్టుకున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన తొలి మెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సులబతరంగా బోధించేందుకు ఈ మేళాలు ఉపకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తీసుకొచ్చిన టీఎల్ఎం స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కొమ్మెర రాధాకృష్ణ, నోడల్ అధికారి దత్తుమూరి, ప్రధానోపాధ్యాయులు ఐత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ఉత్తమ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ఉత్తమ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు వరించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవార్డును మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అందజేశారు. పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, ఉద్యానవనాల అభివృద్ధి, డంపింగ్ యార్డ్ నిర్వహణ, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలను ఆధారంగా చేసుకుని ఈ అవార్డుకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎంపికైంది. కేటగిరీల వారీగా రూ.50వేల జనాభా నుంచి లక్ష జనాభా గల కాగజ్‌నగర్ దక్షిణ భారత దేశంలో ఈ అవార్డుకు ఎంపికైంది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అవార్డును అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, మున్సిపల్ కమిషనర్ అంజయ్యలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకోవాలి

నవతెలంగాణ-తాండూర్



విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని తమ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసుకోవాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ సూచించారు. విద్యా భారతి విద్యా సంస్థలు, విజన్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటుచేసిన మోటివేషనల్ ప్రోగ్రామ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కఠోర సాధన అలుపెరుగని మానసిక శ్రమతో మంచి ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రముఖమోటివేషనల్ స్పీకర్ కం లైఫ్ కోచ్ వేణు కళ్యాణ్ పిల్లలకు లక్ష్యసాధన, కృషి, పట్టుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలోని పదవ తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 600 ప్రైవేట్, ప్రభుత్వ, పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యా భారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సురభి శరత్ రావు, విజన్ జూనియర్ కాలేజ్ మంచిర్యాల్ డైరెక్టర్ సుశీల్, భావన, ఋషి, వాణినికేతన్ కరస్పాండెంట్ రాము, హెడ్ మాస్టర్ ప్రేమలత, కేజీబీవీ ఎస్ఓ కవిత పాల్గొన్నారు.

అనారోగ్య కారణంతో వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మేదరిపేట గ్రామానికి చెందిన దోమ అనంతరావు(75) అనే వద్దుడు అనారోగ్య కారణాలతో హార్పిక్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు దండేపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వయసు మీద పడడంతో ఆరోగ్యం సహకరించక బాధపడుతుండేవాడని ఇటీవలే మంచంపై నుండి కింద పడడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. నొప్పులు భరించలేక బుధవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో బాత్రూంలో ఉన్న హార్పిక్ తాగి వాంతులు చేసుకున్నాడు. ఇంటి చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యానికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య దోమ ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

ఉద్యోగులకు అండగా సింగరేణి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో పనిచేసే కందుగుల అంకులు దురదృష్టవషత్తు మరణించడం జరిగిందని, గురువారం అతని సతీమణికి ఎస్ఎస్ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అంకులు సింగరేణిలో చేసిన సేవలు గుర్తు చేశారు. అదేవిధంగా తాను మరణించడం చాలా బాధాకరమని, సింగరేణి సంస్థకు ఒక ఉద్యోగిని కోల్పోవడం తీరనిలోటని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఉద్యోగుల నుండి రికవరీ చేసిన మొత్తం రూ.53,500 సాంఘిక భద్రత నిధి ద్వారా అతని సతీమణి తిరుమలకి అందజేశారు. అలాగే శ్రీరాంపూర్ ఉపరితల గనిలో పనిచేస్తున్న 30 మంది ఉద్యోగులకు ఎస్ఎల్పి పదోన్నతి పత్రాలు అందజేశారు. ఉద్యోగ నిర్వహణలో పదోన్నతి అనేది తన బాధ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలరీ మేనేజర్ సుధీర్ జక్కులవార్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, రక్షణాధికారి సంపత్, పిట్ సెక్రటరీ కందుల శంకరయ్య, అధికారుల సంఘం గని ప్రతినిధి శ్యామ్ సుందర్ రావు, సంక్షేమ అధికారి బొంగోని శంకర్ పాల్గొన్నారు.

కార్యకర్తల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఈ నెల 7న పటేల్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న బీజేపీ కార్యకర్తల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. నజ్రుల్‌నగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బికాస్ గారామి అధ్వర్యంలో గురువారం నిర్వహించిన వివిధ శక్తి కేంద్ర, బూత్ స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సమ్మేళనానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ నుంచి వర్చువల్ వేదికగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభారి నాగపూరి రాజమౌళి గౌడ్, రణబీర్, సమీర్ గుప్త, అస్తోష్ మండల్, అమిత్ బిశ్వాస్, రాకేష్ రాయ్, సంజీత్ బల, ఆనంద్ బైన్, అతుల్ పట్వారీ, ప్రదీప్ రాయ్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కోసమే పవర్ ప్లాంట్ మూసివేత

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రం రంగంపేటలోని శాలివాన పవర్ ప్లాంట్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే యాజమాన్యం మూసివేసిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. పవర్ ప్లాంట్లను తెరిపించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సీపీఐ(ఎం) నాయకులు గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ పవర్ ప్లాంట్ కార్మికులు గత మూడు నెలలుగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల బోనస్, మూడు నెలల వేతనాలు ఇవ్వాలని, పరిశ్రమకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాలని అన్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొనుగోలుచేసి నేడు ఆ భూముల విలువ పెరగడంతో పవర్ ప్లాంట్ మూసేసి వెంచర్లు పెట్టి రియల్ ఎస్టేట్ ద్వారా కోట్లు గడించాలని యాజమాన్యం కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఈ కుట్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోపకారిగా మద్దతు తెలుపుతున్నాయని, ఈ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పిన బీజేపీ, ఇంటికొక ఉద్యోగం అని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వాలు శాలివాహన పవర్ ప్లాంట్‌కు కావలసిన అనుమతులు మంజూరు చేయకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని పవర్ ప్లాంట్ యాజమాన్యం ప్లాంటును మూసేసి కార్మికుల పొట్ట కొట్టి, తమ ఆధీనంలో ఉన్న భూములను రియల్ ఎస్టేట్ చేసి కోట్లు గడించాలని చూస్తున్నాయని అన్నారు. పరిశ్రమను తెరిపించకుండా కార్మికులను వీధుల పాలు చేస్తే సహించమని పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను తిరిగి ఇవ్వాలని అన్నారు. కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాజేశ్వరి, దులం శ్రీనివాస్, సభ్యులు, ప్రేమ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

'మెరుగైన వేతన ఒప్పందానికి కృషి చేశాం'



నవతెలంగాణ-నస్పూర్

డీపీఈ మార్గదర్శకాతో పని లేకుండా 11వ వేతన ఒప్పందంలో ఐదు సంవత్సరాల కాల పరిమితితో 19 శాతం మెరుగైన వేతన ఒప్పందానికి జాతీయ సంఘాలు కృషి చేశాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బాజీ సైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాన్ని సాధించామని, కానీ టీబీజీకేఎస్ నాయకులు కార్మికులను జాతీయ సంఘాలు మోసం చేశాయని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ దిశగా చేస్తుంటే, అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేతన ఒప్పందం 19 శాతం సాధించి కార్మికులకు న్యాయం చేశామి చెప్పారు. టీబీజీకేస్ నాయకులకు కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఆదినంలో ఉన్నా పెర్క్స్ పే అలవెన్స్‌లు మాఫీ చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులే టీబీజీకేస్ నాయకులకు బుద్ధి చెప్తారని తెలిపారు. ఇతర సంఘాలపై అబద్ధాలు మానేయాలని, వేతన ఒప్పందంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, గునిగంటి నర్సింగరావు, మురళి చౌదరి, నవీన్‌రెడ్డి, రాయలింగు, నగేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

బీఎంఎస్ క్రియాశీల పాత్ర పోషించింది

11వ వేతన ఒప్పందం కలకత్తాలో జరిగిన సమావేశంలో 19 శాతం ఎంజీబి, కనీస వేతన పెరుగుదల, ఐదు సంవత్సరాలకాల పరిమితి నిర్ణయించడం చారిత్రాత్మకమైన పరిణామమని, దీన్ని సాధించడంలో బీఎంఎస్ క్రియాశీలక పాత్ర పోషించిందని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్ షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ నాయకులు బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జీలు జేబీసీసీఐ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా కార్మికులు ఆందోళనలకు సన్నద్ధమైన తరుణంలో వేతనం కనీసం 19శాతం సాధించటం బొగ్గు గని కార్మికుల విజయమని పేర్కొన్నారు. డిసెంబర్ 5వ తేదీ నుండి 9వ తేది వరకు కోల్ ఇండియా, సింగరేణి వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు గని మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించడం జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు విజయవంతం చేయటం వలనే ఏ ఒప్పందం సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు, కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాతాడి శ్రీధర్‌రెడ్డి, పాగిడి శ్రీకాంత్, ఆనందం, అనంతగిరి శ్రీనివాస్, మంద సత్యం, బి.గౌరయ్య, నరసింహారావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు

- ఆసిఫాబాద్ జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్టీసీ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్టు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు మంజూరైన నూతన సూపర్ లగ్జరీ సర్వీసును ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్టీసీలో నూతన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా 1000 కొత్త సర్వీస్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీని మార్పు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ సేవలను ప్రచారం చేసే ప్రజా రవాణా చైతన్య రథం కళాకారులచే నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్రావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, డిపో మేనేజర్ ఏ.శ్రీధర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మంగ, లాలూ, ఎస్సీఎస్టీ జిల్లా కమిటీ మెంబర్ గోపాల్ నాయక్, మైనారిటీ నాయకులు అమర్ బిన్ అహ్మద్, నిసార్, అహ్మద్, ఎంఎఫ్ మధుసూదన్, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్ సూపరింటెంట్ శ్రీనివాస్, సూపర్ వైసర్ ఉదయ్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పెండింగ్‌లో ఉన్న రూ.3500 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బౌరే కళ్యాణ్ కోరారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రమోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు బౌరే కళ్యాణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ.3500 కోట్లు పెండింగులో ఉందన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. స్కాలర్ షిప్, రియంబర్స్‌మెంట్ రాక ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఇంట్లో నుండి డబ్బులు కడితేనే తమ సర్టిఫికేట్‌లు ఇస్తామని లేకపోతే ఇవ్వటంలేదని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడలు లేక బయటి వ్యక్తులకు జల్సాలకు అడ్డాగా మారుతుందని, తక్షణమే ప్రహరీ గోడను నిర్మించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని నిరంతరం కొనసాగించాలని, పట్టణ కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గహాలకు స్వంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు సునీత, మౌనిక, గణేష్, చిరంజీవి, తరుణ్, పావనీ పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

భీమారం : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన మంచిర్యాల జిల్లా తపస్ కాలెండర్‌ను గురువారం తహసీల్దార్ వాసంతి ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాటశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తపస్ మండల శాఖ కమిటీ సభ్యులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్యాలెండర్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఉన్న చిత్రపటాలతో దేశభక్తి భావాలను పెంపొందిచే విధంగా ఆకర్షణీయంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల ప్రగతి కోసం పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి, కాంప్లెక్స్ నోడల్ అధికారి దత్తుమూరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఐత వెంకటేశ్వరరావు, తపస్ జిల్లా అధ్యక్షులు సాయింపు శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని గోపాల్‌నగర్, రేచిని పంచాయితీల్లో చేపట్టిన అభివృద్ధిపనులు గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్‌నగర్ గ్రామపంచాయతీ ల మాదిరిగానే అన్ని పాఠశాలల్లో మన ఊరు-మనబడి పనులను త్వరితగతిన చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు కాంట్రాక్టర్లకు సూచించారు. గోపాల్‌నగర్ పంచాయతీలో చేపట్టిన స్కూల్ బిల్డింగ్ ప్రహరి గోడ కిషన్ షెడ్ బాత్రూంలను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగ తిన పూర్తిచేసిన కాంట్రాక్టర్ సత్యనారాయణ సహకరించిన పంచాయతీ సెక్రెటరీ వసంతలను అభినందించారు. జిల్లాలోని ఎంపీ ఓలు క్రమం తప్పకుండా పంచాయతీలను సందర్శించి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట రేచిని ఎంపీటీసీ మొగిలి శంకర్, ఉపాధి హామీ ఏపీఓ నంద కుమార్, గోపాల్‌నగర్ సర్పంచ్ గజ్జల బతుకమ్మ, రేచిని సెక్రెటరీ శ్రీనివాస్ ఉన్నారు.

క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ-భీమారం

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆంజనేయ గౌడ్‌ను గురువారం మండల బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్బీ స్టేడియంలోని సరిగిన శాట్స్ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి పలువురు క్రీడాభిమానులు హాజరయ్యారు. ఇందులో బాగంగా మండలానికి చెందిన లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర శాట్స్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, శాట్స్ అధికారులు, క్రీడాభిమానులు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తూ.. పలు అవకాశలు కల్పించేందుకు కృషిచేయాలని ఆయనను కోరినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బాగంగా చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌కే సీహెచ్‌పీ గని కార్మికులను అభినందించిన జీఎం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నూతన సంవత్సరంలో భాగంగా సీహెచ్‌పీ కార్మికలతో కరచాలనం ఉత్తేరణకు తోడ్పాటు అందించే విధంగా గురువారం జీఎం చింతల శ్రీనివాస్ ఆర్‌కే సీహెచ్‌పీ గని కార్మికులను అభినందించారు. రామకృష్ణాపూర్ స్థాయిని పెంచుకోవడంలో సీహెచ్‌పీని కాలానుగుణంగా మార్పులు చేపడుతూ రేకుల స్థాయిని పెంచుకోవడం కన్వెన్షన్ వైడెనింగ్, క్వాలిటీ కోసం క్రష్షర్స్ మెయింటెనింగ్ చేస్తూ ఇక్కడి కార్మికులు నిజంగానే ఓల్డ్ ఈజ్ గోల్డ్‌గా తీర్చిదిద్దుతూ డిసెంబర్ వరకు 634 రేకులను రవాణా చేయడం హర్షనీయం అన్నారు. 2022-23 సంవత్సరానికి గాను 33.02 లక్షల టన్నుల టార్గెట్‌కు గాను ఇప్పటివరకు 25.38 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందన్నారు. రక్షణలో గాని క్వాలిటీలో గాని సీహెచ్‌పీ కార్మికులు సమన్వయం చేస్తూ మందమర్రి ఏరియాకు మంచిగుర్తింపు తేవడంలో భాగమయ్యారని అన్నారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, ఏఎస్ఓ ఓదెలు, సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి ఝా, డీవైఎస్ఈ ఏ.చంద్రమౌళి, ఫిట్ సెక్రటరీలు శంకర్రావు, సంజీవ్ సూపర్ వైజర్స్, కల్లెపల్లి శ్రీనివాస్, వేణు, ఆఫీస్ సూపరింటెండెంట్ తిరుపతి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మేదరిపెట్ గ్రామానికి చెందిన మచ్చ మల్లవ్వ(85) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్టు దండేపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు మల్లవ్వ బుధవారం ఉదయం ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్ళిపోయింది. బంధువుల ఇండ్ల సమీప ప్రాంతంలో ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. గతంలో కూడా పలుమార్లు ఇలాగే చేసిందని తెలిపారు. గురువారం ఇంటి సమీప తోటలో వెతుకుతుండగా బావిలో మృతదేహం కనిపించింది. మృతురాలు కుమారుడు మచ్చ ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

జెండా పండుగ నిర్వహణ ఏర్పాట్లు

నవతెలంగాణ-తాండూర్

ఆదివాసీ మన్నెవార్ల(కాలనాడ్) ఆదిమ గిరిజనుల భీమన్న దేవుని పండుగ ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదివాసీ మన్నేవార్ల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. మన్నెవార్ల ఆత్మ గౌరవ దినంగా పిలువబడే ఈ భీమదేవర జెండా పండగ ప్రతి మన్నెవార్ గ్రామాలు, గుడాల్లో ఉత్సాహంగా జరుపుకునేందుకు ఏర్పాటు పూర్తి చేసుకోవాల్సిందిగా పిలుపు ఇచ్చారు.

ద్విచక్ర వాహం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీ కొట్టడంతో కిందపడగా తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారక స్థితిలో ఉన్న మహిళను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో కిందపడిపోయిన మహిళను చూసిన వాహనదారుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మహిళ పట్టణానికి చెందిన వేముల కావేరి(34)గా గుర్తించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రాధాన్యత అంశాల లక్ష్యసాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి, మౌలిక సౌకర్యాలు, తదితర ప్రాధాన్య అంశాల లక్ష సాధనకు సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ అరుణ రాణి, ఎంపీఓ ఎస్.రమేష్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. జీపీడీపీ 2023-24 సంవత్సరానికి గాను ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 9 థీమ్‌ల వారిగా అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు తయారుచేసి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. పూర్తి అవగాహనతో తయారు చేయాలని అధికారులు సూచించారు.

వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-కెరమెరి

గ్రామపంచాయతీ పరిధిలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్ సూచించారు. గురువారం మండలంలోని ఖైరి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని, పారిశుద్యపనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా స్థానిక ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చొరవచూపాలని సూచించారు. ఎంపీడీఓతో పాటు సర్పంచ్ లెన్గూరే విజయ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాలాజీ ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన చెప్పిడే రాఘవులు(40) పురుగుల మందు తాగి గురువారం మృతి చెందినట్టు ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది డిసెంబర్ నెల 25 న రాఘవులు మద్యం తాగిన మైకంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడె, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరళించారు. గురువారం పరిస్తితి విషమించి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్లు మార్చిలోగా లక్ష్యాలు సాధించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఎల్ఐసీ సంస్థ నిర్ధేశించిన లక్ష్యాలను ఏజెంట్లు మార్చిలోగా సాధించాలని కరీంనగర్ ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాదరావు సూచించారు. గురువారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్‌రావు, బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, కాగజ్‌నగర్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల పోటీని తట్టుకొని ఏజెంట్లు వ్యాపారంలో రాణించాలన్నారు. నూతన టెక్నాలజీని ఏజెంట్లు, ఎల్ఐసి అధికారులు, ఉద్యోగులు ఉపయోగించుకోవాలని తెలిపారు. బెల్లంపల్లి బ్రాంచ్ పరిధిలో కాగజ్‌నగర్ ఏజెంట్లు సాధించిన వ్యాపారాన్ని ప్రశంసించారు. ఎల్ఐసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయలను రుణాలుగా అందించి అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్ఐసీ బెల్లంపల్లి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ మహేష్, డెవలప్మెంట్ అధికారులు వివిఎస్ శ్రీనివాసరావు, టీవీ రమణారావుతో పాటు కాగజ్‌నగర్ ఎల్ఐసీ శాటిలైట్ బ్రాంచ్ పరిధిలోని ఏజెంట్లు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సన్మానం

నవతెలంగాణ-తలమడుగు

నూతనంగా ఎన్నుకోబడిన మండల జర్నలిస్ట్ కార్యవర్గానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, గ్రామసర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్ రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షులు ఎం. మహేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నర్రా, నవీన్ యాదవ్, మండల నోడల్ అధికారి రాజశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ రావు, తలమడుగు పీఆర్టీయూ సభ్యులు వై.వినోద్ రెడ్డి, బుద్ధ ప్రకాష్, గంగయ్య, శ్రీనివాస్, స్వామి, వెంకటరమణ, భీంరావ్, గంభీర్, సుజాత, దిలీప్ రెడ్డి, సంతోష్, రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైరిగూడ ఓపెన్‌కాస్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - రెబ్బెన

కైరిగూడ ఓపెన్‌కాస్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కేఎల్ మహేంద్రభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కైరిగూడ ఓపెన్‌కాస్టులో పలు సమస్యలను పీఓ, మేనేజర్, ప్రాజెక్టు ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఓపెన్‌కాస్టులో షిఫ్టుల్లో మైనింగ్‌కు సంబంధించిన అధికారులు, షిఫ్టు ఇన్‌చార్జిలను ఇద్దరు లేదా ముగ్గురిని నియమించారని అదే ఇంజనీరింగ్‌కు వచ్చేసరికి చాలా అడ్జెస్ట్‌మెంట్స్ నడుస్తున్నాయన్నారు. కనీసం ఒక ఇంజనీర్, ఫోర్‌మెన్ కూడా లేకుండా షిఫ్టులు నడిపిస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. షిఫ్టు మొత్తం కూడా షిఫ్టు ఈసి ఫిట్టర్, ఈపీ ఎలక్ట్రీషన్‌ల మీదనే నడుస్తున్నాయని, అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారిని బాధ్యులుగా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షిఫ్టు జనరల్ మజ్దూర్‌లకు ఒకేసారి మూడు పనులు కేటాయిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సరైన మ్యాన్‌పవర్ నియమించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏరియా జనరల్ మేనేజర్ కోరారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, మోరం శ్రీనివాస్, శేషు, సైనారావు, కైరిగూడ ఫిట్ కార్యదర్శి బూపతి రాజేష్, నాయకులు శంకర్, కులవేని సదాశివ్ పాల్గొన్నారు.

దేవాపూర్ క్రికెట్ క్లబ్‌కు రూ.20 వేల విరాళం



నవతెలంగాణ-తలమడుగు

దేవాపూర్ గ్రామంలోని క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు క్రీడా సామాగ్రి కోసం సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మెన్, ప్రముఖ హోమియోపతి వైద్యులు డా. రవికిరణ్ యాదవ్ సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ క్లబ్ సభ్యులకు గురువారం రూ.20 వేలను విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని గురువారం దేవాపూర్ గ్రామంలో సాయి వైకుంఠ ట్రస్ట్ డైరెక్టర్ మేకల రవికాంత్ యాదవ్ ట్రస్ట్ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాపూర్ క్రికెట్ క్లబ్ సభ్యులు డాక్టర్ రవికిరణ్ యాదవ్ క్రికెట్ సామాగ్రి కోసం సహకారం అందించాలని కోరగా అడిగిన వెంటనే తనవంతుగా రూ.20వేలను అందించారు. క్రీడా రంగంలో రాణించాలని క్రీడాకారులను కోరారు. త్వరలో జిల్లా కేంద్రంలో జరిగే ఏసీఎల్ క్రీడల పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్వీ నాయకులు అబ్దుల్లా, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, డీసీసీ కెప్టెన్ వాజిద్, నహీం, సాయి వైకుంఠ ట్రస్ట్ సభ్యులు గోళ్లేని మోహన్, బర్ల వెంకటి, సంతోష్, శ్రీరాములు, జక్కుల రవీందర్ గ్రామస్తులు క్రీడాకారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జీ అజేష్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని స్థానిక కేజీబీవీ బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ కోర్టు ముందు అందరూ సమానమేనని సమస్యల పరిష్కారం కోర్టు ద్వారా మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ చైర్మెన్ ఆదేశాల మేరకు జిల్లాలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. దిశ చట్టం గురించి విద్యార్థినులకు వివరించారు. చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుని తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భోజనశాలని పరిశీలించి, విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, స్థానిక సర్పంచ్ ముత్యం రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నవిత, న్యాయవాదులు రమణగౌడ్, కొమ్మోజీ రమణ, కోర్టు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చదువు ఒక ఆయుధం

నవతెలంగాణ-తాంసి

ఆడపిల్లలకు చదువు ఒక ఆయుధమని బాలల పరిరక్షణ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో గ్రామ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్‌తో చైల్డ్ ప్రొటెక్షన్ పోలీస్ శాఖతో పాటు పలు శాఖల అధికారులతో కలిసి మహిత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో బాలికలకు బాలల హక్కులు వాటి వినియోగంపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు ఒక ఆయుధంగా ఉపయోగ పడుతుందని అన్నారు. పద్దెనిమిది సంవత్సరాలలోపు ఆడపిల్లలు వారి హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటిని వినియోగించుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు పూర్తిగా అరికట్టాలని అన్నారు. బాల్య వివాహాలు జరిగితే మీరుగాని మీచుట్టు పక్కల వారు ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని అన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. లింగ వివక్ష అరికట్టాలన్నారు. ఆడపిల్లలు అన్నింట్లో ముందు ఉండాలని అన్నారు. బాల్య వివాహంపై విద్యార్థులు వేసిన నాటకం అందరినీ కంట తడి పెట్టించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఎస్సై కలీం. ఐసీపీఎస్ వినోద్ కుమార్, బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది పుష్ప, ఎస్ఓ అలైఖ్య, మహిత మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్, వాలంటీర్లు. రాజు, సుజాత, వర్షా వార్డ్ సభ్యులు కాంతారెడ్డి, కన్వీనర్ అరుణ్ కుమార్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయిలో మరోమారు నెం.1గా ఎస్టీపీపీ

- అతి త్వరంలో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు



నవతెలంగాణ-జైపూర్

ఇప్పటికే అరుదైన అవార్డులు గెల్చుకున్న సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ 91.15 పీఎల్ఎఫ్‌తో జాతీయ స్థాయిలో మరోమారు నెం.1 స్థానాన్ని పదిలపర్చుకుంది. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్టీపీపీ అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 2016 ఆగస్టులో ప్రారంభమైన ఎస్టీపీపీ కేవలం ఆరు సంవత్సరాల్లో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధిస్తూ వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి డిసెంబర్ 31 నాటికి మరో మారు దేశంలోనే నెంబర్ వన్‌గా నిల్చింది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్టీపీపీ దేశంలో నెంబర్‌వన్‌గా నిలవడం తమకు గర్వకారణమని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గల 250కిపైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్రాల పీఎల్ఎఫ్‌లను అధిగమించి ఈ ఏడాదిలో రెండు పర్యాయాలు అగ్రభాగాన నిల్చింది. ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యుత్ సంస్థలైన ఎన్టీపీసీ, అదానీ, టాటా, రిలయన్స్, జిందాల్ వంటి సంస్థలతో పోటీపడి నెంబర్ వన్ అనిపించుకుంటుంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథార్టీ వెల్లడించిన నివేదికలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ 7219 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో 91.15 పీఎల్ఎఫ్‌తో ప్రథమ స్థానిలో నిల్వగా తర్వాతి స్థానం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఎన్టీపీసీ వారి కోర్బా ప్లాంట్ దక్కించుకుంది. సీఈఏ ప్రచురించిన 25 అత్యుత్తమ ప్లాంట్ల జాబితాలో మన రెండు తెలుగు రాష్ట్రాల నుండి మరే ఇతర ప్రభుత్వ ప్రైవేట్ థర్మల్ ప్లాంట్‌కు చోటు దక్కకపోవడం గమనార్హం. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చడంలో ఎస్టీపీపీ తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకుంటుంది. ఇప్పటి వరకు ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం 52,328 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి తెలంగాణ రాష్ట్రంలో వినియోగిస్తున్న మొత్తం విద్యుత్‌లో 12 శాతాన్ని సమకూర్చింది. అదేవిధంగా సింగరేణి సంస్థక ఏటా సగటున రూ.400 కోట్లు లాభంగా అందిస్తోందని సంస్థ వెల్లడించింది. 600 మెగావాట్ల ప్లాంట్లుగా రెండు ప్లాంట్లు కలిపి 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌లో రెండు యూనిట్లు సమర్థవంతంగా పని చేస్తుండటం కలిసొస్తుంది. అదేవిధంగా మొదటి ప్లాంట్ 8 సార్లు 100 శాతం పీఎల్ఎఫ్ దాటిన ఈ ప్లాంట్ ఇప్పటికి 4 సార్లు వంద శాతం పైబడిన పీఎల్ఎఫ్‌ను సాధించింది. ఒక్క పీఎల్ఎఫ్ మాత్రమే కాకుండా ఫ్లైయాష్ మేనేజ్‌మెంట్, వాటర్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి అంశాల్లో అద్భుతమైన ప్రతిభను కనబర్చుతోంది.

త్వరలో మరో 800 మెగావాట్ల విద్యుత్ యూనిట్ ఏర్పాటు

1200 మెగావాట్ల విద్యుత్ కేంద్రంగా ఉత్పత్తిని సాధిస్తున్న ఈ ఎస్టీపీపీ అనుబంధంగా త్వరలో మరో 800 మెగావాట్ల యూనిట్ ఏర్పాటుకు సంస్థ సమాయత్తం అవుతోంది. అదనంగా ఏర్పాటు చేయతలపెట్టిన విద్యుత్ కేంద్రానికి సంబంధించి ఇప్పటికే సమగ్ర ప్రణాళికతో ప్రభుత్వ పరమైన అనుమతులు పొందినట్లు సంస్థ వెల్లడించింది. మార్చి నెల నుండి యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభించి కాల పరిమితి లోపు నిర్మాణపు పనులు పూర్తి చేయాలని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు ఆధ్వర్యంలో చర్యలు ముమ్మరం చేశారు. దేశంలో గల వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాల ఆధీనంలో కొనసాగుతున్న అత్యుత్తమ థర్మల్ విద్యుత్ కేంద్రాల పదింటిలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అగ్రస్థానంలో నిల్వడం గర్వకారణమని సింగరేణి అధికారులు పేర్కొంటున్నారు.

పంట సాగుకు రుణ పరిమితి పెంపు

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఖరీఫ్ 2023లో రైతులకు పంట సాగుకు రుణపరిమితిని పెంచి రైతుల ఆర్థిక స్థితిగతులను పెంచడానికి నిర్ణయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ పంట కాలానికి రైతులకు బ్యాంకులు ఇచ్చే రుణపరిమితిని పెంచడానికి కమిటీ నిర్ణయించిందని, ఆ ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి అధికారులకు పంపిస్తామని తెలిపారు. పత్తి, సోయాబీన్, కంది, వరి పంటలకు 20 శాతం చొప్పున, ఇతర పంటలకు 15 శాతం చొప్పున పెంచాలని సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. పండ్లు, కూరగాయలు, మిర్చి, పసుపు పంటలకు 15 శాతం చొప్పున పెంచేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. మల్బరీ పంట సాగుకు ఎకరానికి రూ.30వేలు, తేనె, లక్క సాగుకు 10 శాతం చొప్పున పెంచడానికి నిర్ణయించడం జరిగిందని, పశు సంపద పెంచేందుకు రైతులకు అదనపు ఆర్థిక స్తోమత పెంచేందుకు గతం కంటే రుణపరిమితిని పెంచడానికి నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. పెంచిన రుణపరిమితి వివరాలను బ్యాంకు బ్రాంచులలో, రైతువేదికలలో ప్రదర్శించాలని, రైతుల్లో అవగాహన పెంచడం ద్వారా ఇతర పంటల సాగుకు వీలవుతుందని అన్నారు. ప్రతిపాదించిన ఆర్థిక పరిమితికి సంబంధించిన జస్టిఫికేషన్‌లతో ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు రుణపరిమితిపై సలహాలు, సూచనలు అందించి రుణపరిమితికి ఈ సమావేశంలో ప్రతిపాదించారు. రైతు గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన దృష్ట్యా రైతులకు పంట రుణాలను 20 నుండి 25 శాతం వరకు పెంచాలని పేర్కొన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో, బెడ్ విధానంతో సాగు చేయడం ద్వారా పంట దిగుబడి పెరిగి రైతు ఆర్థిక స్థితి పెంపొందుతుందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఏడిసిసి బ్యాంకు సీఈఓ కె.శ్రీధర్‌రెడ్డి, నాబార్డ్ డిడియం అబ్దుల్ రవూఫ్, అదనపు డిఆర్డిఓ రవీందర్ రాథోడ్, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్లు, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భర్తీకి కృషి చేస్తా

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే మండల పర్యటనలో భాగంగా స్థానిక కోఆప్షన్ సభ్యులు షేక్ జమీర్ ఉర్దూ పాఠశాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఉర్దూ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన తీరు మధ్యాహ్న భోజన వివరాలను విద్యార్థులను అడిగారు. తగినన్ని ఉపాధ్యాయ పోస్టులున్నా ఖాళీల కొరతతో విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమయ్యే అవకాశాలున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి ఉపాధ్యాయుల భర్తీకి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, రావణ్, సంతోష్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ సంకల్పం

అందరికీ మెరుగైన ఆరోగ్యం అందించే దిశగా తెలంగాణ పయనిస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో రూ.8.50లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నిరుపేదలకు కూడా కార్పొరేట్ స్థాయి అత్యాధునిక వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాథమిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరికరాలతో అందించిందన్నారు. రాష్ట్ర ప్రజలు వైద్య అవసరాలను నెరవేర్చే సంకల్పంతో వైద్య విద్య విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, కో అప్షన్ సభ్యుడు షేక్ జమీర్, నాయకులు సంతోష్‌గౌడ్, బూర్ల లక్ష్మీనారాయణ ఆసుపత్రి వైద్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రికవరీలో జిల్లాలో మొదటిస్థానం అభినందనీయం

- ఎస్‌బీఐ జిల్లా అధికారి హన్మంతురావు



జైనూర్ : మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక సాయం అందించి, రుణాలను 82 శాతం వసూలు చేసి జిల్లాలోనే మొదటిస్థానం సంపాదించడం అభినందనీయమని ఎస్‌బీఐ జిల్లా అధికారి హన్మంతరావు అన్నారు. గురువారం మండలంలోని ఐకేపీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ గోపాలకృష్ణ, ఐకేపీ ఏపీఎం సుజాతతో ఎస్‌బీఐ జైనూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఐకేపీ సీసీలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో ఎస్ఎస్‌జీ గ్రూపులు 386 ఉన్నాయని, అందులో బ్యాంకు లోన్ టార్గెట్ ఎస్ఎస్‌జీలో రూ.899.3 కోట్లు ఇచ్చారన్నారు. అందులో 279 ఎస్ఎస్‌జీ గ్రూపులు రూ. 744 కోట్లతో రికవరి చేసి 82.74 శాతంతో నిల్వడం అభినందనీయమన్నారు. ఎస్ఎస్‌జీ మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించి సరైన సమయంలో రుణాలు రికవరీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. 15 మండలాల్లో గతంలో 13, 14 స్థానాల్లో ఉండే జైనూర్ మండల మహిళా ప్రత్యేక గ్రూపులు ఈసారి రికవరీలో మొదటిస్థానం రావడం గర్వకారణమన్నారు. అందులో కీలకపాత్ర పోషించిన ఏపీఎం సుజాత, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ గోపాలకృష్ణతో పాటు వారికి సహకరించిన సీసీలను అభినందించారు. వారికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభినందించి బ్రాంచ్ మేనేజర్ తరపున డైరీలతో పాటు మెమొంటోలను అందజేసి సన్మానించారు. అనంతరం జిల్లా బ్యాంకు అధికారికి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొడప మోతుబాయి, సుమిత్ర, సీసీలు గుణవంత్‌రావు, జీలపల్లి గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ప్రణీత సూచించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మన ఊరు మనబడిలో ఎంపికైన పాఠశాల పనులు ఎక్కడి వరకు వచ్చాయో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేలా చూడాలని డీఈఓ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మెళకువలను నేర్పించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. అనంతరం మండలంలోని లక్కారంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈమె వెంట ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షలో ఏడుగురు డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెగ్యూలర్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే బుధవారం నిర్వహించిన పరీక్షలో ఆరుగురు డిబార్ కాగా గురువారం నిర్వహించిన పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడుతూ రాష్ట్రంలో 9మంది డిబార్ అయినట్టు కేయూ పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డా.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఆదిలాబాద్ నుండి ఏడుగురు ఉన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యార్థి డిగ్రీ కళాశాలలో ఆరుగురు, వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒక్కరు డిబార్ అయినట్టు తెలిపారు. ఎవరైనా కాపీయింగ్‌కి పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన పద్మశ్రీ బృందం

నవతెలంగాణ - జైనూర్

ఈ నెల 26వన దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి మార్లావాయి గుస్సాడీ బృందం ఢిల్లీకి బయలుదేరింది. గురువారం మార్లావాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు ఆధ్వర్యంలో బృంద సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26న ఎర్రకోటలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులను ఎంతో గౌరవించి ప్రోత్సహించినందుకు అభినందించారు. మంచి ప్రదర్శనతో మార్లావాయి గ్రామానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. బృందంలో కనక సుదర్శన్ తదితరులున్నారు.

మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా చేపట్టిన మిగులు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు ఆదేశించారు. మండల పరిధి ఇందారం, పౌనూర్ గ్రామ పంచాయతీలను సందర్శించిన ఆయన దొరగారిపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో నిర్మితమవుతున్న ప్రహరీగోడ, వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పర్యటన ఉన్నందున ఆదివారం లోపు మిగులు పనులు పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాల ఆవరణ చదును చేయించడంతో పాటు మొక్కలు నాటించాలని సర్పంచులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ బాలయ్య, పౌనూర్ సర్పంచ్ సారయ్య, పంచాయతీ కార్యదర్శి రాజమల్లయ్య, ఇన్‌చార్జి పంచాయతి కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద వర్గాల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. రేషన్ షాప్‌ల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేయడాన్ని స్వాగతిస్తూ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని చౌకదారుల దుకాణం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ ఫ్లెక్సీ పాలాభిషేకం చేశారు. కరోనా విపత్కర సమయంలో ప్రజల కష్టాలను చూసి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, నాయకులు జోగు రవి, దినేష్ మాటోలియా, జ్యోతి, రాజేష్, వేదవ్యాస్, పాల్గొన్నారు.

చలికాలం వ్యాధులపై ఆశాలకు అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

చలికాలంలో వ్యాపించే వ్యాధులపై గురువారం పీహెచ్‌సీలో ఆశాలకు హెల్త్ సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ న్యుమోనియా, శ్వాశ కోశ వ్యాధుల గురించి వివరించారు. తీసుకోవాల్సిన చికిత్స జాగ్రత్తపై సూచించారు. సూపర్‌వైజర్‌లు చరణ్ దాస్, సత్తెవ్వ, సీహెచ్ఓ హిమబిందు, వివిధ గ్రామాల ఆశాలు ఉన్నారు.

విశ్వ బ్రాహ్మణ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాంసి

మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీపాద సుభాష్, గౌరవ అధ్యక్షులుగా డి.గంగన్న, ఉపాధ్యక్షులుగా బాలకిష్టు, ప్రధాన కార్యదర్శిగా నాయిని విలాస్‌లతో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షులు దేవిదాస్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి విశ్వా బ్రాహ్మణ కులబంధువులు నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను శాలువతో సన్మానించి అభినందించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ప్రకటన

అటవీ సంరక్షణ ప్రధానాధికారి (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్) (PCCF-HoFF) జారీచేయబడిన PCCF-FC3/FC15/121/2022-FCA Section (4128/2018/FCA-3), dated 04-01-2023 ఆధారంగా ప్రస్తుతమున్న మార్గంలో రోడ్డు వెంబడి ఆప్టిక్ ఫైబర్ కేబుల్ వేయుట కొరకు నిర్మల్, మంచిర్యాల మరియు ఆదిలాబాద్ జిల్లా యొక్క ఖానాపూర్, జన్నారం & ఉట్నూర్-FDPT అటవీ డివిజన్లో 1.0553 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు కోసం మెసర్స్ జియో డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున అటవీ సంరక్షణ చట్టం, 1980 క్రింద అటవీ క్లియరెన్స్ ఇవ్వబడినది.